అతడిని చూసీ చూడగానే సత్యం మొహం చింకి చేటంత అయింది. "మూర్తీ! ఎంత మారిపోయావురా!" అంటూ ఎదురు వెళ్ళాడు మొహం చిట్లించాడు మూర్తి. సత్యం వంక ఎగాదిగా చూశాడు.

సత్యం ఉత్సాహం నీళ్ళుగారి పోయింది. "నేను మూర్తీ సత్యాన్ని! మనిద్దరం కలిసే చదువుకున్నాం. గుర్తు లేదూ?" ఆశగా అడిగాడు.

"ఓ నువ్వా! చాలా ఏళ్ళయిపోయింది కదూ నిన్ను చూసి గుర్తుపట్టలేదు" మొహాన నవ్వు పులుముకున్నాడు మూర్తి.

సత్యానికి సంతోషం వేసింది. "అవును మరి! ఒకటా, రెండా? పదిహేనేళ్ళు దాటింది మనం కలుసుకుని. మీ ఇంట్లో చూశాను కాబట్టి సరిపోయింది గానీ హఠాత్తుగా చూస్తే నేనూ గుర్తు పట్టేవాడిని కాదు". మూర్తి తప్పేం లేదని తేల్చేశాడు.

"రా! కూర్చో! ముభావంగానే ఆదరించాడు మూర్తి. సోఫాలో కూర్చున్నాడు సత్యం. ఇల్లంతా కలియచూసి సంతోషించాడు. పిల్లలెలా వున్నారు? మీ అమ్మా నాన్నా బావున్నారా? మీ తమ్ముళ్ళిద్దరూ ఎక్కడున్నారు?" అంటూ బోలెడు వివరాలు అడిగాడు. అన్నింటికీ ముక్తసరిగా సమాధానం చెప్పి వూరుకున్నాడు మూర్తి.

"నీ గురించి మనవాళ్ళు చాలామంది చెప్పార్రా! మంచి వృద్ధిలోకి వచ్చావనీ, ఇల్లు కట్టుకున్నావనీ, కారు కొనుక్కున్నావనీ చెప్పారు. నాకు ఎంత మాత్రం ఆశ్చర్యం అనిపించలేదు. నువ్వు ఇంటిలిజెంట్‌వి, కార్యదీక్ష పట్టుదల వున్నవాడివి. నువ్వు బాగా షైన్ అవుతావని చిన్నతనంలోనే తెలుసు నాకు" అన్నాడు సత్యం.

విసుగు వేసింది మూర్తికి. "మొదలుపెట్టాడు. ఇలా ప్రతివాడూ రావడం, కాకా పట్టి పన్లు చేయించుకుని చక్కాపోవడం. ఇదే అలవాటు అయిపోయింది. వీళ్ళ పొగడ్తలకి పొంగిపోవడానికి తనేమైనా వెర్రి వెంగళప్పా?" అతని మాటలు విననట్టే పక్కనున్న టెలిఫోన్ డైరెక్టరీ తీసి పేజీలు తిరగెయ్యసాగాడు.

మూర్తిని తెలివిగలవాడు అనడం కంటే బతకనేర్చినవాడు అనడం ఉచితంగా వుంటుంది. చదివినది మామూలు చదువే. చేస్తోంది చిన్న ఉద్యోగమే. తోటి వాళ్ళందరూ నాలుగు వేళ్ళూ నోట్లోకి పోవడానికి తంటాలు పడుతుంటే ఇతను ఇల్లుకట్టి, పెళ్ళాం, పిల్లలకి సకల సౌకర్యాలూ అమర్చి, ఆర్భాటంగా జీవితం సాగిస్తున్నాడంటే అది అతని చాకచక్యమే. పోనీ తేరగా డబ్బు వచ్చిపడే ఉద్యోగమా అంటే అదీ కాదు.

అతని దూరపు బంధువొకడు రాజకీయాల్లో వున్నాడు. ఎలక్షన్లలో గెల్చి ఎం.ఎల్.ఏ. అయి అంతటితో ఆగక మినిస్టర్ కూడా అయిపోయాడు. ఆయన మహా నిక్కచ్చి మనిషి. మూర్తికి ఆయనతో బాగానే పరిచయం ఉంది.

ఆయన మంత్రిపదవి స్వీకరించగానే ఓ అరడజను యాపిల్స్ తీసుకువెళ్ళి అభినందించి వచ్చాడు. ఆ తర్వాత కూడా కొన్నాళ్ళపాటు తరుచుగా వెళ్ళి ఆయన వెంట తోకలా తిరిగాడు. ఏదో వెంట తిరగడమే తప్ప ఏమీ ఆశించకపోవడంతో ఇతని ఉనికి మంత్రిగారినీ ఏమీ బాధించలేదు. అలా కొన్నాళ్ళు తిరిగి కాస్త నలుగురితో పరిచయం ఏర్పడిన తరువాత ఆ పని మానేసి రంగంలోకి దిగాడు.

ఓ రోజు అలా షికారుగా ఒక ఆఫీసుకి వెళ్ళి ఒక పెద్దమనిషిని పలకరించి "రిలీవరు వచ్చాడా? ఎప్పుడు ప్రయాణం?" అని అడిగాడు.

తెల్లబోయాడతను. "ప్రయాణమా? ఎక్కడికి?" అడిగాడు.

"అదేమిటి మీకింకా తెలియదా? మీకు ట్రాన్స్ఫరయిందిగా మొన్న మీ హెడ్డాఫీసుకి వెళ్ళినప్పుడు మీ మేనేజర్ మాటల్లో చెప్పాడు" అన్నాడు మూర్తి తాపీగా.

ఆయన గుండె ఠారుమంది. ఇక్కడికొచ్చి ఏడాది కాలేదు. మళ్ళీ ట్రాన్స్ఫరా? పిల్లల చదువులు సగంలో వున్నాయి. ఏం చెయ్యను దేవుడోయ్ బెదిరిపోయి మూర్తి చేతులు పట్టుకున్నాడు. "బాబ్బాబు మీరే నన్ను ఆదుకోవాలి. మేనేజర్కి చెప్పి ట్రాన్స్ఫర్ ఆపించండి" అంటూ బతిమిలాడాడు.

"ఎలా? ఆర్డర్ నా కళ్ళారా చూశాను! అదీగాక ఇప్పుడే వచ్చాను. మళ్ళీ ఊరెళ్ళాలంటే" అంటూ బుర్ర గోక్కున్నాడు.

"అలా అనకండి, మీరు వెళ్ళక తప్పదు. ఖర్చులన్నీ నేనే భరిస్తాను" బతిమాలాడు ఆ ప్రాణి.

"సరే కానివ్వండి! ఏం చేస్తాం?" అయిష్టంగానే అంగీకరించాడు మూర్తి. అతని ఖర్చులకి, అక్కడ ముడుపులకి సరిపడా డబ్బు లిచ్చాడు ఆ ప్రాణి. ఆ డబ్బు జేబులో పెట్టుకుని ఇంటికెళ్ళి రెండ్రోజులు ముసుగుతన్ని పడుకుని మూడోరోజు అతన్ని కలుసుకుని, "ఆపేశాను అష్టకష్టాలు పడాల్సి వచ్చింది" అంటూ ఆపసోపాలు పడిపోయాడు.

ఆ మానవుడు గుండెనిండా ఊపిరి పీల్చుకున్నాడు. 'చాలా థ్యాంక్స్' 'కృతజ్ఞతలు'. తెలుపుకుని ఓ పచ్చకాయితం ఇతని జేబులోపెట్టి పిల్లలకి స్వీట్స్ పట్టుకెళ్ళండి అన్నాడు.

అదే మొదలు ఇక ఆ తరువాత, మళ్ళీ వెనక్కి తిరిగి చూడలేదు మూర్తి. ఒకటీ రెండు కేసులు అలా బ్లఫ్ చేసి విజయవంతంగా ముగించి క్రమంగా నిజమైన కేసులు చేపట్టాడు. తనకున్న పరిచయాలని బాగా వినియోగించుకున్నాడు.

అతని పలుకుబడి పెరిగింది. అందరికీ అతనంటే అదో రకమైన భయం. వెనకాల కొండంత అండ వున్నవాడు. కాదంటే మనకే ఎసరు పెడతాడేమో ఎందుకొచ్చిన గొడవ అనుకుని అతను చెప్పిన పని చేసి ఇచ్చింది పుచ్చుకుని అతని చేత మంచి అనిపించుకోవడం అలవాటు చేసుకున్నారు.

మూర్తి పలుకుబడి దినదిన ప్రవర్ధమానంగా పెరిగిపోయింది. ఇంజనీరింగ్‌లో సీట్లు, ఇళ్ళ స్థలాలు, ఉద్యోగాలు, ట్రాన్స్‌ఫర్లు, ఒకటేమిటీ మూర్తికి చేతగానిపనిలేదు. అతడు తల్చుకుంటే సాధించి తీరుతాడు. కాబట్టి అతడిని ఆశ్రయించేవారికి కొదువలేదు. మూడు పువ్వులూ ఆరుకాయలుగా వుంది అతని పని.

ఏ మాటకామాటే చెప్పుకోవాలి. మన దేశాన్ని రత్నగర్భ అనీ, సస్యశ్యామల దేశమనీ వర్ణించిన కవుల కాళ్ళమీదపడి సాష్టాంగ నమస్కారం చెయ్యాలి. వాళ్ళమాట అక్షరసత్యం.

అమెరికా వంటి అగ్రరాజ్యాలలోనూ, గల్ఫ్‌కంట్రీస్‌లోనూ కూడా కావల్సినంత డబ్బుంది. కానైతే కష్టపడి పనిచేస్తేగానీ దొరకదు. కానీ మన పవిత్రదేశంలో అలాంటి చాదస్తాలేం అక్కర్లేదు. బుర్రలో తెలివుండి, గుండె ధైర్యం వుండి, అందరూ చేసే పనేకదా ఇది. ఇక నన్నెవడేం చేస్తాడు అనే ధీమా వుంటే చాలు. తేలికగా డబ్బు సంపాదించుకోవచ్చు. ఎవరూ ఏమీ అనరు సరికదా సంఘంలో గౌరవం పెరుగుతుంది. బోలెడంత గ్లామరు.

అసలామాట కొస్తే మన్లోమనకు వాటాలు కుదిరి, కొనేవాడు దొరకాలేగాని తాజ్‌మహల్ అమ్మేసినా అడిగే వాడుండడు.

ఆ బంగారు బాటను ఎన్నుకున్న మూర్తి జీవితం నిత్యకళ్యాణం పచ్చతోరణం లా వుంది. అయితే కొన్ని చికాకులు కూడా లేకపోలేదు. అతని ప్రతిష్ఠ తెలిసి ఏదో మనవాడు కదా సాయం చెయ్యకపోతాడా అనుకుని వచ్చే అలగాజనం బోలెడు మంది.

మూర్తి తెలివితక్కువ వాడేం కాదు. తనకు లాభసాటిగా వుండే వ్యవహారాలను ఎంతో గౌరవంగా చూసుకుంటాడు. అలాగే ఎందుకూ పనికి రాని కేసుల్ని అతి చులకనగా చూసి విదిలించి పారేస్తాడు.

చూసీ చూడగానే కనిపెట్టగలడు. అది ఎలాంటి వ్యవహారమో, మామూలు బట్టలు ధరించి అతిమామూలుగా వున్న ఈ శాల్తీని చూడగానే కనిపెట్టేశాడు. ఇది బేవార్సు కేసని, అందుకే సత్యానికి గౌరవం ఇవ్వలేదు.

అతడిని కూర్చోబెట్టి ఆ పనీ ఈ పనీ చూసుకుంటూ కాలక్షేపం చెయ్యసాగాడు. ఇద్దరి వంతూ సత్యమే మాట్లాడుతున్నాడు.

"ఎప్పటినుండో నీ దగ్గరికి రావాలనే ఆలోచన. ఏదీ కుదిరితేనా? ఎక్కడో మారుమూల వున్నాను. అంతా అడివి. ఇక్కడికి చాలా దూరం బయటి ప్రపంచంతో సంబంధం వుండదు" అన్నాడు సత్యం.

"ఖర్మ ట్రాన్స్‌ఫర్ కావాలి కాబోలు, లోలోపలే విసుక్కున్నాడు మూర్తి." ప్రస్తుతం సిటీలో పోస్టులన్నీ ఫుల్ ఒక్కటి కూడా ఖాళీగా లేదు. అసలిప్పట్లో ఎవర్నీ కదిలించే ప్రసక్తి వద్దని చాలా స్ట్రిక్ట్ ఆర్డర్స్. ఓ రెండేళ్ళదాకా ఎక్కడి వాళ్ళు అక్కడ వుండాల్సిందే" అనేశాడు.

"అవును అదో తలనొప్పి పల్లెటూరు. అన్నింటికీ దూరం అన్నమాటేగానీ అక్కడి లైఫ్ నాకు బాగానే ఉందిరా. నాల్రూపాయలకి పాలు దొరుకుతాయి. ఇల్లు విశాలంగా వుంది. కూరలూ అవీ పెరట్లోనే వేశాం. సినిమాలు గట్రా లేవుకాబట్టి ఆ దండగ కూడా లేదు. పోతే పిల్లల చదువులు, ఇరవైమైళ్ళ దూరంలో సెంట్రల్‌స్కూల్లో చదువుకుంటున్నారు. బస్‌లో వెళ్లొస్తారు. ఈ ఏడాది మా అబ్బాయి ట్వెల్త్ పూర్తి అవుతుంది. వచ్చే ఏడాది వాడిని ఎక్కడో ఓ చోట చేర్పిస్తే ఇక నిశ్చింత అన్నాడు సత్యం.

"అదీ సంగతి ఈయనగారి కొడుక్కి ఇంజనీరింగ్‌లోనో, మెడిసిన్‌లోనో సీటు కావాలి. అందుకని ముందుగానే వచ్చాడు. సణుకున్నాడు మూర్తి.

"ఏం చేరుస్తావు నా మొహం. సీట్లంటే మాటలా? కిందటేడు మెడిసిన్‌కి లక్షా ఇరవై, కంప్యూటర్ ఇంజనీరింగ్‌కి డెబ్భై పలికింది. దానికి మళ్ళీ బోలెడంత ఇన్‌ఫ్లుయన్స్ కావాలి. మహా మహా వాళ్ళకే దొరకటం కష్టం. మామూలు వాళ్ళకి లాభం లేదు" అనేశాడు ఖచ్చితంగా.

నవ్వేశాడు సత్యం. "నిజమే మరి చదువుల రేట్లు చుక్కల్ని అంటుతున్నాయి. నాకా బాధలేదులే. భగవంతుడి దయవల్ల పిల్లలిద్దరూ బాగానే చదువుకుంటారు.

మా అబ్బాయికి ఫస్ట్ రేంక్ వస్తుంది. ఈ మిడ్‌టర్మ్ పరీక్షల్లో, నైన్‌టీ టూ పర్సెంట్ వచ్చింది. వాడికి మెరిట్‌తోనే సీట్ వస్తుందనుకుంటున్నాం. అమ్మాయి కూడా ఫర్వాలేదు. క్లాస్ ఫస్ట్‌రాదు గానీ అయిదో రేంక్ లోపలే వుంటుంది. వాళ్ళ గురించి నాకేమీ దిగులు లేదు.

నా చెల్లెలి పెళ్ళి చెయ్యాలి. అది అయిపోతే నా బాధ్యత తీరినట్లే. సంబంధం కుదిరింది. అది కుదిరితే చాలదుగా డబ్బు కావద్దూ? ఇప్పుడా పని మీదే వచ్చాను. ఉత్సాహంగా చెప్పాడు.

ఇదా చిట్టి తండ్రీ నీ పని చెల్లెలు పెళ్ళికి అప్పుకా ఇన్ని కబుర్లు? అమ్మ సత్తిగా! ఏమో అనుకున్నాను గట్టి ప్లానే వేసుకొచ్చావ్. నీకు అప్పిస్తే అసలుమాట దేవుడెరుగు వడ్డీ అయినా కట్టగలవా నువ్వు? నిన్ను నమ్మి ఇచ్చేస్తాననే? ఓర్నీ ఆశపాడుగానూ!" హేళనగా నవ్వుకున్నాడు మూర్తి.

"నా దగ్గరెక్కడుంది డబ్బు? తంతే దమ్మిడీ లేదు. ఏదో ఇల్లూ కారూ, ఆర్భాటంగా కనిపిస్తాను. అంతే ఎంత చెట్టుకి అంతగాలి అన్నట్లు సంపాదన మించిన ఖర్చులు ఇంక నీకేం ఇవ్వగలనూ? చెప్పేశాడు.

కంగారు పడిపోయాడు సత్యం. "నువ్వు పొరబడ్డావురా! డబ్బుకోసం వచ్చానంటే నీ దగ్గరికి డబ్బుకోసం వచ్చానని కాదు. పి.యఫ్.లోన్‌కి అప్లై చేశాను శాంక్షన్ అయింది. పెళ్ళికి ఇంకా టైముంది. ఒక్కసారే అంతా ఇవ్వరుగా. రెండు మూడు సార్లు తియ్యాలి. ఇప్పటి నుంచి మొదలు పెడితే పెళ్ళినాటికి డబ్బు చేతిలో ఉంటుంది. కాయితాలు కదిలి రావడానికి చాలా కాలం పడుతుంది కదా! అందుకే నేనే వచ్చి తీసుకెళ్ళాలనుకుని వచ్చాను. అదీగాక ఎల్.ఐ.సీ పాలసీ కూడా ఒకటీ వుంది. అటూ వెళ్ళాలి ఆఫీసు టైం అయ్యేలోగా నిన్నోసారి పలకరించి వెళ్దాం అని ఇలా వచ్చాను. ఏమిటో జీవితం బొత్తిగా రొటీన్ అయిపోయింది. ఇలా ఎవరైనా పాత ఫ్రెండ్స్‌ని కలిస్తే ప్రాణం లేచివస్తుంది. నిన్నిలా కలుసుకోవడం నాకెంతో బావుంది" చెప్పుకుపోతున్న సత్యం గడియారం గంట కొట్టడంతో వాచీ చూసి గాభరా పడిపోయాడు.

"ఇక నేను వెళ్తాన్రా! బిజీగా ఉన్నట్లున్నావ్. నేనొచ్చి నీ పని పాడు చేశానేమో. మా చెల్లాయ్ పెళ్లికి శుభలేఖ పంపిస్తాను. ఫేమిలీని తీసుకొని తప్పకుండా రావాలి. వస్తాను మరి" అంటూ లేచి గుమ్మందాకా వెళ్ళినవాడల్లా ఆగిపోయి వెనక్కి తిరిగాడు.

"మూర్తీ నువ్వెందుకో చాలా డల్‌గా ఉన్నావురా! చిన్నప్పుడెంతో హుషారుగా ఉండే వాడివి. నీ ఆరోగ్యం బాగుందా? ఈ తీరికలేని లైఫ్‌తో విసిగిపోయి ఉంటావ్ పోనీ పదిరోజులు మా ఇంటికి రాకూడదూ? ప్రశాంతంగా ఉంటుంది. హాయిగా విశ్రాంతిగా ఉండొచ్చు. ఇక్కడి నుంచీ డైరెక్ట్ బస్ ఉంది. బస్ దిగి ఎవర్నడిగినా మా ఇంటికి దారి చెప్తారు. వీలు చూసుకొని రా తప్పకుండా. మరి వెళ్ళొస్తాను" అనేసి మిత్రుడిని తన ఇంటికి ఆహ్వానించి వెనక్కి చూడకుండా వెళ్ళిపోయాడు.

చేష్టలుడిగి నిలబడి పోయాడు మూర్తి.

ఏమిటి? ఏ పనీ లేకపోయినా ఊరికే చూసి వెళ్దామని వచ్చాడా? ఎప్పటి పద్ధతి ఇది? మనిషి ఎదురైనా పలకరిస్తే పట్టుకొని వేళ్ళాడతాడేమో అనే భయంతో మొహం తిప్పుకు పోయే ఈ రోజుల్లో హల్లో బావున్నారా అని ఎవరైనా పలకరిస్తే చచ్చాం పట్టుకుంటే వదలడు అవతల బోలెడు పన్లున్నాయి అని బాధపడే రోజుల్లో ఎవరితోనైనా నవ్వుతూ మాట్లాడితే నెత్తినెక్కేస్తాడేమో అని దూరంగా ఉంచే ఈ రోజుల్లో ఇంకా ఇలాంటి వాళ్ళున్నారా?

అందులోనూ తనవంటి వారి దగ్గర పనుంటే తప్ప ఎవరూ రారు. అదే అలవాటయిపోయింది. ఎదురుగా తియ్యగా మాట్లాడి పన్లు చేయించుకుంటూనే, కాస్త మొహం చాటైతే చాలు కక్కుర్తి పీనుగ, మరీ దొంగవెధవ అంటూ తిట్టడం ఎన్నోసార్లు తన చెవుల్తో విన్నాడు. బయటి వాళ్ళెవరూ ఆదరించరు. గౌరవించరు. సరే తన వృత్తి అలాటిది. ఇంట్లోనూ అదే పరిస్థితి. భార్యా పిల్లలు ఈజీమనీకి అలవాటు పడిపోయారు. రెండు చేతులా ధారాళంగా ఖర్చు పెడతారు. ఎంత సంపాదించినా చాలదు. ఎవరికీ తృప్తిలేదు. కొడుకు ఒక కొరివి. మాట్లాడితే ఇంట్లోంచి పారిపోతాడు. మూడేళ్ళుగా ఇంటరుతో కుస్తీ పడుతున్నాడు. చదువులేకపోయినా షోకులకి మాత్రం తక్కువ లేదు. ఇక కూతురికున్న తలపొగరు ఇంకెవరికీ ఉండదు. వాళ్ళిద్దరికీ తండ్రి పట్ల గౌరవం ఎంతమాత్రం లేదు. డబ్బు అవసరం అయితే మాత్రం ఎదుటపడతారు.

ఇంటా బయటా ఈ వాతావరణంలో కాలం గడుపుతున్న మూర్తి పూర్తిగా యాంత్రికంగా మారిపోయాడు. అందుకే తనకోసం వచ్చిన చిన్న నాటి స్నేహితుడిలోని స్నేహాన్ని ఆప్యాయతనూ గుర్తించలేకపోయాడు.

అదెంత మధురమైన అనుభవం. పాతస్నేహితుడు కనబడగానే అమాంతం కావిలించుకుని, పన్లన్నీ పక్కన పెట్టి, కాళ్ళు జాపుకుని కూర్చుని కాఫీ తాగుతూ

చిన్ననాటి కబుర్లన్నీ గుర్తు చేసుకుంటూ ఉంటే ఓహ్ ఎంత బాగుంటుంది. ఎప్పుడో గానీ దక్కని ఆ సంతోషాన్ని చేజేతులా జారవిడుచుకున్నాడు.

కావిలించుకోడం, కబుర్లు చెప్పడం అలా ఉంచి అంతదూరం నుండి వచ్చిన మిత్రుడికి కాఫీ కాదు గదా ఒక్కగ్లాసు మంచినీళ్ళు కూడా ఇవ్వలేదు. వాడి పిల్లలు బాగా చదువుకుంటున్నారంటే సంతోషించి ఆశీర్వదించే సంస్కారం తనలో లేకపోయింది. వాడి చెల్లెలు పెళ్ళి కుదిరిందని చెప్తే వివరాలడిగే కనీస మర్యాద కూడా పాటించలేక పోయాడు తను.

ఇంత చేసినా సత్యం 'బాధపడలేదు. పైపెచ్చు తన ఆరోగ్యం గురించి ఆదుర్దాపడ్డాడు. తనింటికి రమ్మని ఆప్యాయంగా ఆహ్వానించాడు. ఎంత మంచివాడు' ఎంత గొప్పవాడు!

సత్యం మళ్ళీ వస్తే బాగుండు. కానీ ఎందుకొస్తాడు? తన ప్రవర్తన చూశాక ఆత్మాభిమానం ఉన్న ఏ మనిషైనా మళ్ళీ తన ఇంటికి రాడు. పోనీ తను వెళ్ళగలడా ఏ మొహం పెట్టుకుని వెళ్తాడు.

ఈ సృష్టిలో అన్నింటికంటే గొప్పది స్నేహం. నిలువెత్తు ధనం పోసినా దొరకనిది ఆప్యాయత. ఆ రెండూ ఏకమై వస్తే ఆ మధురిమను ఆస్వాదించలేకపోయిన తన దురదృష్టాన్ని తల్చుకుంటే మూర్తికి చెప్పలేనంత బాధకలిగింది. కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి.

ఏదో పని మీద అటువచ్చిన అవంతి తండ్రి వాలకం చూసి తెల్లబోయింది.

"ఎందుకు నాన్నా ఏడుస్తున్నావ్?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

*ఆంధ్రప్రభ – ఆదివారం 3 జనవరి, 1993*